
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
సోమవారం 27 అక్టోబరు 2025



ప్రధాని మోదీ నోట కొమురం భీం మాట 6
గుంజాల శివారులో పులి సంచారం 7
కపాస్ యాప్‌ను రద్దు చేయాలి : బండారు 6
రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం 7


పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

» గాంధీపార్క్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా



పుస్తకం చదువుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడం ద్వారా ఆలోచనాశక్తి, జ్ఞానాభివృద్ధి పెరుగుతాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం స్థానిక గాంధీ పార్క్‌లో నిర్వహించిన పుస్తక పఠనం చేద్దాం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పుస్తకాలు మనలో ఆలోచనలను పెంచుతాయని, అవి మన జ్ఞానాన్ని విస్తరింపజేస్తాయన్నారు. చదివిన పుస్తకాల్లో నచ్చిన అంశాలను చర్చించడం ద్వారా ప్రజల్లో, విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుందన్నారు. సమయం దొరికినప్పుడల్లా ఒక మంచి పుస్తకాన్ని చదవడం అలవాటు చేసుకోవాలని సూచిస్తూ, పుస్తకాలలోని మంచి విషయాలను నేర్చుకొని ఆచరణలో పెట్టడం ద్వారా సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని చెప్పారు. గ్రంథాలయాల్లో ఎన్నో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక పార్కులో పిల్లల లైబ్రరీ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇందులో తెలంగాణ సారస్వత పరిషత్ గౌరవ సభ్యుడు, సాహితీవేత్త సామల రాజవర్ధన్‌ను జిల్లా కలెక్టర్ సన్మానించారు. అంతకు ముందు పలువురు పాఠకులు కలెక్టర్‌కు పుస్తకాలను బహూకరించారు. అనంతరం క్రీడా పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, డీసీఈబీ సెక్రెటరీ గణేందర్, అశోక్, రవీందర్ రెడ్డి, జిల్లాలోని కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, రచయితలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



● ఉట్నూర్‌లోని నిరీక్షణ గదులలో ప్రసవం కోసం చేరిన ఉమాపతి కుంటకు చెందిన మంగం అర్చన

అందుబాటులో.. నిరీక్షణ గదులు

» ఏజెన్సీలో మాతా శిశు మరణాలు జరగకుండా అధికారుల చర్యలు
» అయినా సుఖ ప్రసవాలల్లో జాప్యం
» గర్భిణులను సమన్వయ పరచడంలో వైద్య సిబ్బంది విఫలం
» ఈడీడీ(ఎస్టిమేట్ డెలివరి డేట్) నమోదులో నిర్లక్ష్యం
» ఇటీవల అంబులెన్స్‌లోనే ప్రసవాలు
» ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ తగ్గని డెలివరీలు
» ఉమ్మడి జిల్లాలో గడిచిన తొమ్మిది నెలల కాలంలో 28 పీహెచ్‌సీల పరిధిలో 5,314 ప్రసవాలు
» ప్రభుత్వ ఆసుపత్రుల్లో 3,581 ప్రసవాలు కాగా, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 1417, హోం డెలివరీలు 316

ఉమ్మడి జిల్లాలోని.. ఏజెన్సీ ప్రాంతాలలో మాతాశిశు మరణాలు జరగకుండా నిరీక్షణ గదులలో సుఖ ప్రసవాలు నిర్వహించేలా అధికారులు కృషి చేస్తున్నారు. కానీ ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు మాత్రం గర్భిణులను సమన్వయ పరచడంలో విఫలమవుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి జిల్లా అధికారులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో, జైనూర్, ఆసిఫాబాద్, మంచిర్యాలలో సుఖ ప్రసవాల కోసం నిరీక్షణ గదులు నిర్మించారు.

ఉట్నూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని మారుమూల గ్రామీణ ఆదివాసీ గిరిజన ప్రాంతాల మహిళలకు గర్భం దాల్చిన నాటి నుంచి సరైన అవగాహన కల్పించి తేదీలను నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే ఇటు ఆశా వర్కర్లు కాని, అటు ఆయా ప్రాంతాల ఏఎన్‌ఎంలు కాని స్పందించక పోవడం వల్ల సరైన సమయంలో నిరీక్షణ గదులకు మహిళలను చేర్చలేక పోతున్నారు. ఫలితం గ్రామీణ ప్రాంతాల మహిళలు కొందరు అంతంత మాత్రంగానే నిరీక్షణ గదులకు వస్తున్నప్పటికీ మరికొందరు నిరీక్షణ గదులకు చేరుకోలేక పోతున్నారు. గర్భిణులకు అవగాహన కల్పించడంలో ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు సకాలంలో స్పందించి ఇంకా నిరీక్షణ గదులకు గర్భిణులను చేరవేస్తే మరింత ప్రయోజనాలు కలుగుతాయని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు అంటున్నారు.

అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం

గ్రామీణ గిరిజన మహిళలు గర్భవతులుగా పేర్లు నమోదు చేసుకున్న నాటి నుంచి సరైన మందులు అందించి అవగాహన కల్పించాల్సిన వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో గర్భిణుల ఎస్టిమేట్ డెలివరి డేట్ (ఈడీడీ)లను గర్భిణులకు తెలిపి నాలుగు, ఐదు రోజుల ముందుగానే ప్రసవం కోసం ఆసుపత్రుల్లో గానీ, అందుబాటులో ఉన్న నిరీక్షణ గదులకు తరలించి సుఖ ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బందితో పాటు ఆశావర్కర్లు చూడాల్సి ఉంది. కానీ ఈడీడీ తెలవక పోవడం వల్ల ఇళ్ల వద్దనే ప్రసవ నొప్పులు అధికం కావడంతో హుటాహుటిన 108 అంబులెన్స్‌లలో గర్భిణులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. దీంతో మార్గమధ్యలోనే పురిటి నొప్పులు తీవ్రం కావడం వల్ల 108 సిబ్బంది అంబులెన్స్‌లను రోడ్డు పక్కన నిలబెట్టి సుఖ ప్రసవాలు చేస్తున్నారు. గతంలో సైతం ఇలాంటి ప్రసవాలు అంబులెన్స్‌లలో జరిగినప్పటికీ.. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోక పోవడం వల్ల ఈనెల రోజుల్లోనే ఉట్నూర్ ఏజెన్సీలోని గర్భిణులు ఆసుపత్రులకు తరలించే లోపు పురిటి నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీలు సుఖ ప్రసవాలు నిర్వహించారు.

అంబులెన్స్‌లోనే ప్రసవాలు

ఇంద్రవెల్లి మండలంలోని కన్నాపూర్‌కు చెందిన గిరిజన మహిళ ఈనెల 7న పురిటి నొప్పులతో బాధపడుతుండగా.. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో పాటగూడ వద్ద ఈనెల 7న అంబులెన్స్‌లోనే ప్రసవించింది. అదేమాదిరి ఉట్నూర్ మండలంలోని తాండ్రకు చెందిన ముక్తాబాయిని ప్రసవం కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా..

(తరువాయి 6వ పేజీలో....)

అందుబాటులో నిరీక్షణ గదులు

కుంర శిరీష్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్, ఉట్నూర్



ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నిరీక్షణ గదులు గర్భిణుల కోసం అందుబాటులో ఉంచాం. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వస్తున్న గర్భిణులను నిరీక్షణ గదులలో పెట్టి సుఖప్రసవాలు జరిగే లా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూస్తాం

కే.మనోహర్, ఏడీఎంహెచ్‌వో ఉట్నూర్



ఏజెన్సీ వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూస్తాం. ఆశావర్కర్ల ద్వారా గర్భిణులకు అవగాహన కల్పిస్తాం. నిరీక్షణ గదులలో వారిని చేర్పించి సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటాం.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ట్రాఫిక్ పోలీసులు

అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతీఒక్కరు స్మరించుకోవలని ట్రాఫిక్ సీఐ ప్రణయ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి సైకిల్ ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని కొమురం భీం చౌక్ వద్ద ప్రారంభమైన సైకిల్ ర్యాలీ ప్రధాన కూడళ్ల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా పోలీసు అమరుల త్యాగలను కీర్తిస్తు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రణయ్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను తెలియ చెప్పేందుకు వారం పాటు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ఈ క్రమంలో అమరుల త్యాగాలను స్మరించుకుంటూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ ఎస్సై మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



తాత్కాలిక రోడ్డును నిర్మించుకుంటున్న గోవింద్‌పూర్ వాసులు

గ్రామానికి తాత్కాలిక రోడ్డు నిర్మాణం

భీంపూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామట్‌వాడ అనుబంధ ఆదివాసి గ్రామం అయిన గోవింద్ పూర్ మంచి నీటి సమస్యతో గ్రామం వీడి మరో చోట ఇళ్లు ఇర్మించుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ గ్రామానికి రోడ్డు లేక ఇబ్బంది ఎదుర్కుంటున్నారు. ఆదివారం గ్రామస్థులంతా కలిసి ఎడ్ల బండ్లతో మట్టిని తీసుక వచ్చి తమ గ్రామానికి వెళ్లే మార్గంలో చిన్న కాలువపై పైపులు వేసి తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. తమ గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని అధికారులు, నాయకులు తమ గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని గోవింద్‌పూర్ గ్రామస్థులు వేడుకుంటున్నారు.



మంత్రి సీతక్క నుంచి నియామక పత్రం అందుకుంటున్న కొండేరి స్వరాజ్యలక్ష్మి

ఉట్నూర్‌వాసికి గ్రేడ్ 1 ఉద్యోగం

ఉట్నూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కొండేరి శివాజీ, రాజేశ్వరి దంపతుల కుమార్తె శ్రీమతి కొండేరి స్వరాజ్యలక్ష్మి ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన మహిళ, శిశు సంక్షేమ శాఖ విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రేడ్ 1 ఎక్స్టన్షన్ ఆఫీసర్ ఉద్యోగం సాధించారు. బాల్యం నుంచి చదువులో చురుకుగా ఉన్న స్వరాజ్యలక్ష్మి హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో హోమ్‌సైన్స్ విభాగంలో డిగ్రీ పట్టా పొందారు. ఆమె తన తల్లిదండ్రులతో పాటు భర్త అమంద వెంకటరమణ ప్రోత్సాహంతో విజయం సాధించినట్లు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కాగా, స్వరాజ్యలక్ష్మిని కుటుంబ సభ్యులతో పాటు బంధువులు అభినందించారు.

నేడు పెన్షనర్ల 'చలో ఆదిలాబాద్'

బోథ్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికిగాను ఈ నెల 27న చలో ఆదిలాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ ప్రధాన కార్యదర్శి మురళిధర్‌లు పేర్కొన్నారు. పెన్షనర్లకు రావాల్సిన బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు పేర్కొన్నారు. దీర్ఘకాలిక సమస్యలపైన కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు. ఇందులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, తదితరులున్నారు.

ఆర్య వైశ్యుల వనభోజనాలు

నేరడిగొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో వనబోజనాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వేంకటేశ్వర ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వన భోజనాలు చేశారు.

నేటి కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

● హాజరుకానున్న దయానంద సరస్వతి

ఉట్నూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలలో ఆధ్యాత్మిక భావన మరింత పెంపొందించడానికి ఉట్నూర్‌లో కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతియేటా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆధ్యాత్మిక భావన కలిగి ఉన్న వారు ఎవరికీ చెడు చేయకుండా కష్టార్జితాన్ని నమ్ముకుని జీవించడం అలవర్చుకుంటారని, శాంతి భద్రతల రక్షణలో ముందుంటారని భావించి ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కార్తీక దీపోత్సవ సమితి తెలిపింది. సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్న కార్తీక దీపోత్సవ కార్యక్రమానికి కావాల్సిన ఏర్పాట్లను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గత వారం రోజులుగా మండలంలోని వివిధ గ్రామాలలో ఆటోకు స్పీకర్ ఏర్పాటు చేసి దీపోత్సవం గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

దీపోత్సవానికి అతిథుల రాక

రెండు రోజుల పాటు మండల కేంద్రంలో నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి ముఖ్య అతిథిగా దయానంద సరస్వతి, యోగాత్మ అంతారం దాదాజీ, రాంసింగ్ మహరాజ్, సూరజ్ మహరాజ్, యశ్వంత్ మహరాజ్‌లతో పాటు వక్తలుగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ విభాగ ప్రచారక్ శివాకుమార్‌లు హాజరు కానున్నట్లు నిర్వాహకులు డాక్టర్ సాడిగే రాజగోపల్ తెలిపారు. వీరితో పాటు ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్‌సింగ్, ఆదిలాబాద్ ఆర్మ్ రిజర్వ్‌డు డీఎస్పీ చోహాన్ రఘునాత్‌రావులను ఆహ్వానించడం జరిగిందని అన్నారు. ఉట్నూర్ మండలం నుంచి పోలీసు శాఖలో సబ్ ఇన్స్‌పెక్టర్లుగా ఉద్యోగం చేస్తున్న నరేష్, రాజశేఖర్‌లను కూడా ఆహ్వానించినట్లు తెలిపారు. మొదటి రోజు విష్ణు సహస్రనామ పఠనంతో పాటు శివకేశవుల అభిషేకం, అనంతరం దీపోత్సవం ఉంటుందని, అదే విధంగా రెండవ రోజు సుదర్శన యాగం నిర్వహించిన అనంతరం దీపోత్సవం నిర్వహిస్తామన్నారు.

దీపోత్సవానికి పూజా సామగ్రి

రెండు రోజుల పాటు నిర్వహించనున్న కార్తీక దీపంలో పాల్గొననున్న మహిళలు తమ వెంట పూజ వస్తువులు తీసుకు రావాలని సమితి సభ్యులు కోరారు. పూజలకు కావాల్సిన పసుపు, కుంకుమ, మంగళహారతి,కళవం చెంబు, దీపంనూనె, వత్తులు, ప్రమిదలు, రెండు తమలపాకులు, రెండు కుడుకలు, ఒక గణపతి పోక అక్షింతలు, చక్కెర, పువ్వులు, హారతి కర్పూరం, అగర్బత్తిలు, అగ్గిడబ్బ వెంట తెచ్చుకోవాలని అన్నారు.



దీపోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

ప్రశాంతంగా సర్వేయర్ పరీక్షలు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రెండో విడత శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్ సర్వేయర్ అభ్యర్థులకు ఆదివారం పరీక్షలు జరిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు థియరీ, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్లాటింగ్ పరీక్ష జరగగా.. మొత్తం 167 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. తొలివిడతలో నిర్వహించిన పరీక్షకు హాజరు కానీ అభ్యర్థులకు ఈ పరీక్షలకు అనుమతించారు. భూకొలతల శాఖ అధికారి రాజేందర్, ప్రత్యేక అధికారి రాజలింగు, కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ అతిక్ బేగం, తదితరులు పరీక్ష తీరును పర్యవేక్షించారు.

భారీ వర్షంతో తడిసిన మొక్కజొన్న, సోయా

బోథ్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఆరబెట్టిన మొక్కజొన్న, సోయా బీన్ పంటలు తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు కుప్పలుగా పోసిన పంటను కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఊహించని విధంగా కురిసిన భారీ వర్షంతో ఆరబెట్టిన పంటలపై పారీలను కప్పి నానకుండా కాపాడుకున్నారు. పారిలను కప్పే సమయంలో తోడుగా ఎవరు లేకపోవడంతో కొంతమంది రైతుల పంటలు నీటిలో కొట్టుకు పోవడంతో పాటు తడిసి పోయింది. ఓవైపు వర్షం కురవడం మరోవైపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు.



● తడిసిన సోయా పంటలో నుంచి నీటిని తొలగిస్తున్న రైతులు

గత్యంతర లేక ప్రైవేట్‌లో విక్రయాలు

పంట చేతికి వచ్చి 15 రోజులు అయిన కొనుగోలు జరుపక పోవడంతో సోయా రైతులు ప్రైవేట్ దళారులకు విక్రయించుటవాల్సి వస్తున్నది. కొంత మంది రైతులు ఇప్పటికే విక్రయించుకున్నారు. పంట కొనుగోలు పై జాప్యాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

అర్హులైన ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లు

● హౌసింగ్ ఏఈ నజీర్ మహ్మద్

తలమడుగు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అర్హులైన ఆదివాసీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని గృహ నిర్మాణ శాఖ నజీర్ మహ్మద్ అన్నారు. ఆదివారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన నందిగామ్మలో 24 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. ఇల్లు మంజూరు కోసం దళారులు నమ్మి మోసపోవద్దన్నారు. అర్హులైన లబ్ధిదారులను ప్రభుత్వమే గుర్తించి మంజూరు చేస్తుందన్నారు. ఇప్పటి వరకు మండలంలో దాదాపు 500 ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని ఇందులో ఇప్పటి వరకు సగానికి పైగా పూర్తి ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. త్వరలోనే మండలంలో వంద శాతం నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు మొదటి విడత, రెండో విడత, మూడో విడతగా నేరుగా లబ్ధిదారుని ఖాతాలోకి డబ్బులు జమ చేస్తామన్నారు.



ఇంటి నిర్మాణం కోసం భూమిపూజ చేస్తున్న హౌసింగ్ ఏఈ నజీర్



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

కపాస్ యాప్ రద్దు చేయాలి

» తేమ 20 శాతం వరకు సడలించాలి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రం పత్తి కొనుగోళ్ల కోసం తెచ్చిన కిసాన్ కపాస్ యాప్‌ను రద్దు చేయాలని, పత్తి కొనుగోలులో తేమ శాతాన్ని 20 శాతం వరకు సడలించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశాన్ని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అతి వృష్టి కారణంగా రైతులు పంట దిగుబడి సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు నష్ట పోయిన పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో సరైన నెట్వర్క్, ఇతర సదుపాయాలు ఇంకా లేనందున కిసాన్ కపాస్ యాప్‌తో పత్తి కొనుగోలు చేపట్టడం, ఆదివాసీ రైతులకు అవగాహన లేక టెక్నికల్ ఇబ్బందులతో ప్రైవేట్ వ్యాపారులకు అమ్మే పరిస్థితి ఉంటుందన్నారు. పాత పద్ధతిలో పత్తి కొనుగోలు చేయాలని, కపాస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పత్తిలో తేమ 20శాతం వరకు సడలించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, ఉమ్మడి జిల్లా నాయకులు ఉయిక విష్ణు, తొడసం శంబు, కొట్నాక్ సక్కు,మడావి నాగోరావ్, అశోక్, ఆత్రం కిష్టన్నా, కుమ్ర భీంరావు బొజ్జ ఆశన్న పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న దాడుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న వివక్ష మాత్రం కొనసాగుతొందని, హింసలు, అత్యాచారాలు పెరుగుతుండడం ఆందోళనకరమని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశలత అన్నారు. ఆదివారం మాధవరావు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఐద్వా సెమినార్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళల హక్కులు, వారి సంరక్షణ కోసం అందుబాటులో ఉన్న చట్టాలు, ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశలత మాట్లాడుతూ... మహిళలు హక్కుల కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి ఉందని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్ కేంద్రంగా ఐద్వా జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో మహిళల హక్కులు, భవిష్యత్తు పోరాట కార్యాచరణపై చర్చించనున్నట్టు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు లంక జమున, కోవే శకుంతల, మంజుల, సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనల మల్లేష్ పాల్గొన్నారు.

పరామర్శ



సంతోష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటాల గ్రామానికి చెందిన జాదవ్ సంతోష్ తల్లి ఇటీవలే మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్. జహీర్. దేవేందర్ రెడ్డి. సురేందర్, ప్రతాప్ సింగ్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించండి

బోథ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు పెంచుకుంటున్న పశువులన్నింటికి టీకాలు వేయించారని పశువైద్యాధికారి డాక్టర్ సుశీల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బాబెర గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ముందు జాగ్రత్తగా తమ పశువులన్నింటికి టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌తో పాటు వీఏలు రాజేందర్, రమేష్ బీరయ్య, ఇళ్ల పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి



తర్లంకేలో టీకాలు వేస్తున్న రాథోడ్ జీవన్

నేరడిగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి వేయించాలని మండల పశు వైద్యాదికారి రాథోడ్ జీవన్ అన్నారు. మండలంలోని తర్లం కే. గోండు గూడ గ్రామాల్లో ఆదివారం గాలికుంటు కుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో గల పశువులకు టీకాలు వేసి పశువులకు సోకే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

ప్రధానోపాధ్యాయుడికి విశిష్ట పురస్కారం

నిర్మల్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విశ్రాంత సంఘ భవనంలో ఆదివారం పాటే మా ప్రాణం లయన్స్ క్లబ్ వారియర్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భాష్యం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి. ప్రశాంత్ 'విశిష్ట విద్యా రత్న - 2025' అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా టి. ప్రశాంత్ మాట్లాడుతూ... ఈ అవార్డు నాకు లభించడం నా విద్యార్థులు, నా పాఠశాల టీచర్స్, నా తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే సాధ్యమైంది. ఈ గౌరవాన్ని వారికి అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షు లు సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ ప్రియా కపిల్, కరస్పాండెంట్ కౌశిక్, ప్రశాంత్‌ను అభినందించారు.

యథేచ్ఛగా వేప కలప అక్రమ రవాణా

» నడిరోడ్డుపై లోడుతో ట్రాక్టర్ ట్రాలీ

» అధికారుల మౌనం

నర్సాపూర్(జి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం రాత్రి 30 ఏళ్ల వయసున్న భారీ వేప కలప లోడుతో ట్రాక్టర్ ట్రాలీలో యథేచ్ఛగా తరలిపోతున్న దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' గమనించింది. తెలంగాణ వాల్టా చట్టం ప్రకారం ఇంత పెద్ద వృక్షాలను నరకడానికి, రవాణా చేయడానికి ట్రాన్సిట్ పర్మిట్ (రవాణా అనుమతి) తప్పనిసరి. ఈ అనుమతిని యజమానులు ఆన్‌లైన్‌లో లేదా అటవీ శాఖ ద్వారా పొందాలి. కానీ వ్యాపారులు చట్టాలను ఉల్లంఘిస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నా ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి అక్రమ కలప రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



అర్లీ(కే) ఎక్స్ రోడ్డు మీదుగా భైంసా వెళ్తున్న వేప చెట్ల లోడు ట్రాక్టర్

లైట్లు లేక నడిరోడ్డుపై నిలిచిన ఆర్టీసీ బస్సు

» 120 మంది ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు



అర్లీ(కే) ఎక్స్ రోడ్డు వద్ద హెడ్‌లైట్లు పనిచేయక పోవడంతో నిలిచిపోయిన బస్సు దృశ్యం

నర్సాపూర్(జి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం రాత్రి నిర్మల్ నుండి రాజురా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. బస్సు ముందు హెడ్‌లైట్లు పనిచేయకపోవడంతో అర్లీ(కే) ఎక్స్ రోడ్డు వద్ద బస్సు నిలిచిపోయింది. బస్సులో దాదాపు 120 మంది ప్రయాణికులు ఉండగా, రాత్రివేళలో మరో బస్సు రావడానికి రెండు గంటలు పడుతుందని సిబ్బంది తెలిపారు. ప్రైవేట్ బస్సు యజమాని మెకానిక్‌ను కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే నిలచిపోయిన బస్సును డ్రైవర్ అంత్యంత ప్రమాదకరంగా, హెడ్‌లైట్లు లేకుండానే మరో ఆర్టీసీ బస్సు వెనుక అర్లీ(కే) ఎక్స్ రోడ్డు నుండి నిర్మల్ వరకు బస్సును తీసుకువెళ్లారు. రాత్రిపూట ప్రయాణికుల భద్రతను విస్మరించిన డ్రైవర్ చర్యపై స్థానికులు మండిపడుతున్నారు. రాజురా గ్రామానికి ఆర్టీసీ బస్సులను పెంచాలని, రాత్రివేళల్లో నడిచే బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు జాన్సన్ నాయక్ పరామర్శ



గోసంపల్లెలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జాన్సన్ నాయక్

ఖానాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోసంపల్లి గ్రామానికి చెందిన చందు ఇటీవల మృతి చెందడంతో ఆదివారం వారి కుటుంబాన్ని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా చందు మృతికి గల కారణాలను తెలుసుకున్న జాన్సన్ వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మనోజ్ మృతదేహాన్ని చూసేందుకు జాన్సన్ నాయక్ ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ మనోజ్ భౌతిక కాయాన్ని సందర్శించిన ఆయన వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొక్కుల ప్రదీప్, శనిగారపు శ్రావణ్, పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, సల్ల నరేందర్ రెడ్డి, తోట సుమిత్, సంద రాకేష్, నామెడ ధర్మరాజు, కొప్పుల రాజేశ్వర్, అజయ్, మహిపాల్ సహా పలువురు స్థానిక నాయకులున్నారు.

బీట్ ఆఫీసర్ రాథోడ్ విజయలక్ష్మిని సస్పెండ్ చేయాలి

» అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే జితేందర్



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

ఇంద్రవెల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వాగ్మారే గౌతం మృతికి కారణమైన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాథోడ్ విజయ లక్ష్మీను సస్పెండ్ చేయాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే జితేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడుతూ ఉట్నూర్ మండలంలోని గొట్టిపటార్ గ్రామానికి చెందిన వాగ్మారే గౌతం అదే గ్రామంలో ఫారెస్ట్ ప్లాంటేషన్‌లో పశువులు మేపుతున్నాడనే కోపంతో బీట్ ఆఫీసర్ రాథోడ్ విజయలక్ష్మీ నీపై కేసు చేస్తానని చెప్పి ఇంటికి వెళ్లి బెదిరించారన్నారు. దీంతో మనస్తాపానికి గురైన గౌతం తన పంట పొలంలో క్రిమి సంహారక మందు తాగి మృతి చెందాడని, దీనికి కారణమైన బిట్ ఆఫీసర్ రాథోడ్ విజయలక్ష్మీను వీధుల నుంచి తొలిగించి, కుటుంబానికి 20 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి కాంబ్లే మారుతి, భీం ఆర్మీ మండల అధ్యక్షుడు సూర్య వంశీ, ఉత్తం, దళిత సంఘాల నాయకులు వాగ్మారే కామరాజ్, సావంత్ లహుదాస్, పరత్ వాగ్ దత్త, సోమోరే నాగోరావు, గాయక్వాడ్ భారత్, కాంబ్లే మనోజ్, రాజేందర్, శుద్ధోధన్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మధ్యలో ఆగిపోయిన చదువులకు 'ఓపెన్' దారి



జిల్లా పరిషత్ పాఠశాలలో స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ తరగతులు ఆదివారం నర్సాపూర్ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జిల్లా కోఆర్డినేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ యు. గంగాధర్, ఇన్‌చార్జి సబ్ ఇన్స్‌పెక్టర్ శంకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్ గంగాధర్ మాట్లాడుతూ అనేక కారణాల వల్ల చదువును మధ్యలోనే ఆపేసిన వారికి ఓపెన్ స్కూల్ విద్య ఒక గొప్ప వరం అన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకొని, దూర విద్యలో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్న ఎందరినో స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం ఎస్ఎస్‌సీ, ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టడీ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ దర్శనం దేవేందర్, తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భూమన్నతో పాటు పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

అందుబాటులో.. నిరీక్షణ గదులు

(5వ పేజీ తరువాయి...)

ఈనెల 10న మార్గమధ్యలో కుమ్మరితండా వద్ద అంబులెన్స్‌లో ప్రసవించింది. ఉట్నూర్ మండలంలోని హీరాపూర్‌కు చెందిన గిరిజన మహిళ పూస్నాక గోదావరిని ఉట్నూర్ ఆసుపత్రి నుంచి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు సుఖ ప్రసవం కోసం తరలిస్తుండగా.. ఈనెల 11న ఇంద్రవెల్లి సమీపంలో రోడ్డు పక్కన అంబులెన్స్‌లో ప్రసవించింది. ఇదేకాకుండా ఈనెల 18న ఉట్నూర్ మండలంలోని గోటిగోండుగూడకు చెందిన అనసూయను సుఖ ప్రసవం కోసం ఉట్నూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా.. ఏందా సమీపంలో రోడ్డు పక్కన అంబులెన్స్ నిలిపి అంబులెన్స్‌లో ఈఎంటీ ప్రసవం నిర్వహించారు. దీనికి కారణం గర్భిణులకు సంబంధించి వైద్య సిబ్బంది గాని, ఆశావర్కర్లు కానీ మహిళలు గర్భం దాల్చిన రోజును సక్రమంగా గుర్తించక పోవడం వల్ల ఈడీడీ ప్రకటించలేక పోతున్నట్లు వైద్య సిబ్బంది ఒప్పుకుంటున్నారు.

'ప్రైవేట్'లోనూ ప్రసవాలు అధికం

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో గ్రామీణ ప్రాంతాల మహిళలకు సుఖ ప్రసవాలు జరిపించాలని, మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నప్పటికీ.. ప్రభుత్వ ఆసుపత్రుల తరహాలోనే ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ప్రసవాలు అధికంగా జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఈ సంవత్సరం తొమ్మిది నెలల కాలంలో 28 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 5,314 గర్భిణులు ప్రసవించగా.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 3581 ప్రసవాలు జరగగా, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 1417 ప్రసవాలు జరిగాయి. హోమ్ డెలివరీలు 316 గ్రామీణ ప్రాంతాలలోనే జరిగాయి. గ్రామీణ ప్రాంతాల కంటే ఎక్కువ పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గర్భిణులు చాలా మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు గ్రామీణ స్థాయిలో పని చేస్తున్న వైద్య సిబ్బంది పనితీరును మెరుగు పరిచి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా లక్షలాది రూపాయలు వెచ్చించి ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నిరీక్షణ గదులలో ప్రసవాల తేదీని గుర్తించి ముందుగా నిరీక్షణ గదులకు తరలించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు అంటున్నారు.

ప్రధాని మోదీ నోటా భీం మాట

ఉట్నూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జల్ జంగల్ జమీన్ కోసం, ఆదివాసీ గిరిజనులకు స్వేచ్ఛ స్వాంత్రం కోసం నిజాం సైన్యాన్ని ఎదురించి వీర పోరాటం జరిపిన ఉమ్మడి జిల్లా గోండు వీరుడు కొమురంభీం గురించి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడారు. ఆదివారం ప్రధానమంత్రి నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో కొమురంభీం గురించి ప్రస్తావించారు. 20ఏళ్ల వయస్సులోనే బ్రిటిష్ వారి దోపిడీ, నిజాం సైన్యం దురగాతలను ఎదురించిన మహనీయుడి జయంతి సైతం ఇటీవల జరుపుకున్నారన్నారు. ఎంతో మంది గిరిజనుల హృదయాల్లో గూడుకట్టుకొని పోరాట యోధుడుగా నేటి తరం ఆదివాసం గిరిజనులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు.

విద్యార్థిని అభినందించిన గ్రామస్థులు



విద్యార్థి ఆకాంక్షను సన్మానిస్తున్న కజ్జర్ల గ్రామస్థులు

తలమడుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కజర్ల గ్రామానికి చెందిన కంచం అశోక్ రాజేశ్వరి దంపతుల కూతురు ఆకాంక్ష ఇటీవల వెలువడిన ఉత్తీర్ణతలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వరంగల్ సీటు సాధించిన విద్యార్థిని ఆకాంక్షను ఆదివారం కజ్జర్ల గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ స్వామి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డిలు ఆకాంక్ష చిన్నతనం నుంచి చాలా కష్టపడుతూ చదువులో రాణించిందన్నారు. కష్టపడి చదువుకొని రైతులకు మంచి సేవ చేయాలని వారు కోరారు. అనంతరం ఆకాంక్ష తల్లి దండ్రులను సన్మానించారు. ఇందులో గ్రామ పెద్దలు మొట్టే పూర్ణచందర్. అగ్గిమల్ల గంగన్న, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

మోకు దెబ్బ ఉమ్మడి జిల్లాల ఇన్‌-చార్జిల నియామకం

నిర్మల్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గౌడజన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల బలమైన నిర్మాణం చేయడానికి రాష్ట్ర, జాతీయ కమిటీల నాయకులను పాత ఉమ్మడి జిల్లాలకు నియమించినట్లు జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ తెలిపారు. గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల బలమైన నిర్మాణం చేయడానికి రాష్ట్ర, జాతీయ కమిటీల నాయకులను ఒక్కొక్కరిని పాత ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నాం. ఆదిలాబాద్‌కు సీపతి లింగాగౌడ్, నిజామాబాద్‌కు కొండాపురం బాలరాజ్ గౌడ్, మెదక్‌కు రాగుల సిద్ది రాములు గౌడ్, రంగారెడ్డికి బాలసాని సురేష్ గౌడ్, హైదరాబాద్‌కు బాలేశం గౌడ్, నల్లగొండకు రాగుల కిరణ్ కుమార్ గౌడ్, ఖమ్మంకు అనంతుల రమేష్ గౌడ్, మహబూబ్ నగర్ కేసరి ఆంజనేయులు గౌడ్, వరంగల్‌కు ముత్యం నర్సింలు గౌడ్, కరీంనగర్‌కు బుర్ర శ్రీనివాస్ గౌడ్‌లను నియమించినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

● మహారాష్ట్రకు తరలిస్తున్న అక్రమార్కులు

సిర్పూర్(టి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దు మండలమైన సిర్పూర్(టి)లో రేషన్ బియ్యం అక్రమ రవాణా మళ్లీ జోరందుకుంది. పేదలకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యాన్ని కొందరు మహారాష్ట్ర మార్కెట్లకు తరలిస్తున్నారు. సెప్టెంబరు నుంచి అక్టోబరు మధ్యకాలంలో వరుస దాడులు జరిపిన అధికారులు మొత్తం 150 క్వింటాళ్లకు పైగా బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. చెక్ పోస్టులు, రైల్వే స్టేషన్, రైస్ మిల్లులు, రేషన్ దుకాణాల వరకు ఈ దందా విస్తరించిందని విచారణలో తేలింది. సిర్పూర(టి) సరిహద్దు గ్రామం కావడంతో అక్రమ రవాణా దారులు ప్రధానంగా వెంకట్రావుపేట్ మీదుగా పోడ్సా, రైలు మార్గం మీదుగా వీరూర్, రాజురా ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై కైడా దందా కొనసాగిస్తున్నారు. కొందరు డీలర్లు స్థానిక రేషన్ షాపుల నుంచే బియ్యంను కొనుగోలు చేసి మాఫియాలకు అందజేస్తున్నారు. తహసీల్దార్ రహీముద్దీన్ మాట్లాడుతూ రేషన్ బియ్యం విక్రయిం చినట్లయితే మూడు సార్లు పట్టుబడితే లబ్ధిదారుల రేషన్ కార్డులను రద్దు చేస్తామన్నారు. పేదలకు కడుపునింపుకోవడానికి పంపిణీ చేస్తున్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిం చారు.



సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌లో అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం(ఫైల్)

ఇటీవల ఇలా..

- సిర్పూర్(టి) రైల్వే స్టేషన్ వద్ద సెప్టెంబరు 5న తనిఖీల్లో 25 క్వింటాళ్ల బియ్యం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- మండలంలోని మద్దెల వాగు సమీపంలోని రైస్ మిల్లులో సెప్టెంబరు 12న సుమారు 100 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి.
- పారిగాం రేషన్ డీలర్ వ్యవహారంలో అక్టోబరు 10న 12.92 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం.
- రైల్వే స్టేషన్ వద్ద అక్టోబరు 14న 3.05 క్వింటాళ్ల బియ్యం పట్టివేత
- వెంకట్రావుపేట చెక్‌పోస్టు వద్ద అక్టోబరు 17న 5.03 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

ప్రత్యేక బృందాల ఏర్పాటు..



రైల్వే స్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే పలువురిపై 6(ఏ) కేసు నమోదు చేశాం. పారిగాం ఘటన, మద్దెలవాగు ఘటనలతో అధిక మొత్తం బియ్యం దందా వెలుగులోకి రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, పోలీసు శాఖలు పూర్తి స్థాయిలో సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెడుతున్నాం. అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుం టాం. పట్టుబడితే పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తాం.

- ఎస్సై సురేష్, సిర్పూర్(టి)

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ఆసిఫాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో ఒక బాలికలకు ఆదివారం నిశ్చితార్థం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, చైల్డ్ హెల్ప్‌లైన్ బృందం, పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణాధికారి మహేష్ మాట్లాడుతూ మైనర్లకు వివాహం చేయడం చట్ట విరుద్దమని అన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలని చెప్పారు. బాల్య వివాహం నిర్వహిస్తే లక్ష రూపాయల జరిమానా, జైలు శిక్షకు గురవుతున్నారు. ఇలాంటి వివాహాల్లో పాల్గొన్న పెద్దలు, పురోహితులు, బంధువులు, పెళ్లికుమారుడు, వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. బాల్య వివాహాలు బాలల భవిష్యత్‌ను దెబ్బతీస్తాయని చెప్పారు. విద్య, ఆరోగ్యం, సురక్షిత వాతావరణం కల్పించి పిల్లల భవిష్యత్ కోసం తల్లి దండ్రులు, పెద్దలు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి సమాచారం అందించాలన్నారు. బాలిక కుటుంబీలకు కౌన్సెలింగ్ నిర్వహించి సఖీ కేంద్రానికి తరలించారు. కార్యక్రమం లో చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, కానిస్టేబుల్ సంతోష్, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. నలుగురికి గాయాలు

బెజ్జూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆదివారం బెజ్జూరు మండలం ఇందుర్‌గాం, కుశ్నపల్లి గ్రామాల మధ్య రెండు బైకులు ఢీ కొనడంతో నలుగురికి తీవ్ర గయాఆలు కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుర్‌గాంకు చెందిన సెండె లక్ష్మణ్, లక్ష్మి, నికాడి నిర్మలలు ముగ్గురు ఒకలిసి ఒకే ద్విచక్ర వాహనంపై బెజ్జూరుకు వస్తుండగా కుశ్నపల్లి గ్రామానికి చెందిన కడప విజయ్ నాగులువాయి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కరమంలో కుశ్నపల్లి చెరువు వద్ద ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ క్రమంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా విజయ్, లక్ష్మణ్‌ల పరిస్థితి విషమంగా మారింది. గాయ పడ్డ వారిని బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడి వైద్యుల సూచనల మేరకు లక్ష్మణ్, లక్ష్మి, విజయ్‌ని కరీంనగర్‌కు తరలించగా నిర్మలను మంచిర్యాలకు తరలించారు.

లాండ్రీ కేటాయింపులో నిబంధనలు వాష్

- ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో కొరవడిన పారదర్శకత
- ఏకపక్షంగా నిర్వహణ బాధ్యతలు అప్పగింత
- టెండర్ లేకుండానే లావాదేవీలు ధారాదత్తం
- ప్రభుత్వ సంస్థలో రజకుల ప్రాధాన్యానికి తూట్లు

బాసర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యాసంస్థ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో అక్రమాలు బట్టబయలవుతున్నాయి. గత ఐదేళ్లుగా లాండ్రీ సేవలు ఏకపక్షంగా ఒకే వ్యక్తికి కేటాయించి, స్థానిక రజక కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ సంస్థల్లో లాండ్రీలకు రజకులకు కేటాయించాలని, స్పష్టంగా స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పినప్పటికీ అధికారులు కన్నెత్తి చూడకుండా అడ్డదారులో వ్యాపారాన్ని కట్టబెట్టారు. ఇది కేవలం లాండ్రీతోనే ఆగలేదు. స్టేషనరీ షాప్ కూడా టెండర్ లేకుండా ఏళ్ల తరబడి కొనసాగుతుండటం వెనుక లోపాయికరి అవగాహనలు ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్యాంపస్ సుమారు 9 వేల మంది విద్యార్థులకు, 2వేల మంది అధికారి సిబ్బంది ఉన్నారు. వీరి అవసరాల కోసం అధునాతన లాండ్రీ యూనిట్‌ను యూనివర్సిటీ సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. నామమాత్ర రుసుంతో విద్యార్థులకు దుస్తులు ఉతికి, ఇస్త్రీ చేసి ఇవ్వాలనేది ఉద్దేశ్యం. కాని, యూనివర్సిటీలో చదువుతున్న చాలా మంది విద్యార్థులు దిగువ తరగతి, నిరుపేద వర్గాల నుంచి వచ్చినవారు కావడంతో ఈ సేవలు వారికి ఎంతో అవసరం. అయితే ఈ లాండ్రీని గత ఐదేళ్లుగా ఒకే వ్యక్తికి ఏకపక్షంగా అప్పగించడంపై స్థానిక రజకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంస్థల్లో లాండ్రీలను స్థానిక రజక కుటుంబాలకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినప్పటికి అధికారులు దీన్ని పట్టించుకోవడం లేదు.

క్యాంపస్ లాండ్రీలో... ప్రైవేటు దందా..

క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన లాండ్రీ నిర్వాహకులు అద్దె చెల్లిస్తున్నారా లేదా అనేది కూడా రహస్యంగానే మిగిలిపోయింది. లాండ్రీ నిర్వాహకులు క్యాంపస్ బయట వ్యాపార సంస్థలు, హోటళ్లు, ఆస్పత్రులతో పాటు ఇతరులకు సేవలు అందిస్తున్నారు. మెషినరీ మొత్తం యూనివర్సిటీ డబ్బుతో సమకూర్చినప్పుడు బయటి వారికి సేవలు ఎందుకు..? ఇది ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కాదా..? అనే ప్రశ్న తలెత్తుతున్నాయి. అంతేకాకుండా కొంత మంది ఉద్యోగులు ప్రతిఫలంగా ఉచిత సేవలు పొందుతున్నారని సమచారం. ఇది విద్యార్థుల కోసమే ఏర్పాటు చేసిన సదుపాయం కాగా బయటి వ్యాపారాలకు ఎలా మళ్లిస్తారని విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



క్యాంపస్‌లోని స్టేషనరీ షాపు



క్యాంపస్‌లో గల లాండ్రీ భవనం

> **స్థానిక కులవృత్తుల వారికే కేటాయించాలి**
>
> బాసర యూనివర్సిటీలో గల లాండ్రీ, బార్బర్ షాపులను స్థానిక కుల వృత్తులకు కేటాయించి ఉపాధి కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల వారికే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ దిశా అధికారుల కూడా చర్యలు తీసుకోవాలి.
>
> **- బిదూర్ రమేష్, బాసర గ్రామం**

స్టేషనరీ షాపులో అదే తీరు...

ఇక స్టేషనరీ షాప్ విషయానికి వస్తే, ఇది మరింత ఆశ్చర్యకరం. యూనివర్సిటీలో వ్యాపారం నిర్వహించాలంటే టెండర్ ప్రక్రియ ద్వారా దక్కించుకోవాలి. ఏడాది లేదా రెండేళ్లకు మళ్లీ టెండర్ నిర్వహించాలని నిబంధనలు ఉన్నాయి. కాని, ఇక్కడ మాత్రం ఏళ్ల తరబడి ఒకే వ్యక్తి వ్యాపారం కొనసాగిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోక పోవడం వెనుక మతలబేమిటో తెలియాల్సి ఉంది. ఈ విషయాన్ని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

క్రైం సమాచారం

వృద్ధుడి ఆత్మహత్యా యత్నం

- రక్షించిన జాలరి
- కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నం

బాసర, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో తీవ్రమనస్థాపానికి గురయిన ఓ వృద్ధుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన ఆదివారం బాసరలో చోటు చేసుకుంది. నిజామాబాద్ దుబ్బగల్లికి చెందిన సదరు వృద్ధుడు నదిలో దూకేందుకు ప్రయత్నించాడు. అయితే అదే సమయంలో అక్కడ ఉన్న స్థానిక జాలరి కర్రీ సాయిలు అనే యువకుడు దీనిని గమనించి వెంటనే స్పందించాడు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా గోదావరిలో దూకి వృద్ధుడిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చాడు. ఆ తర్వాత, సాయిలు వెంటనే పోలీసులకు సమా చారం అందించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆ వృద్ధుడిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో మృత్యువాత



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై ఇమ్రాన్

నేరడిగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో, మండలంలోని ఆరేపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఐషర్ కంటైనర్ లారీ టైరు పగలడం వలన రోడ్డుపై నిలుపగా అదే సమ యంలో, ద్విచక్ర వాహనం పై వస్తున్న ఆత్రం ధర్ము. గణేష్‌లు వెనుక నుంచి ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఆత్రం ధర్ము (28) అక్కడికక్కడే మృతిచెందగా వెనుక కూర్చున్న గణేష్ (24)తీవ్రంగా గాయాల య్యాయని, వెంటనే గణేష్‌ను నిర్మల్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతులు ఇద్దరు మండలం లోని లింగట్ల గ్రామానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విశాదచాయాలు అలుముకు న్నాయి.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

అంకాపూర్,కొలాంగూడలో గంజాయి పట్టివేత

- పట్టుకున్న గంజాయి విలువ రూ.3లక్షలు



గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై విష్ణువర్ధన్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్ కొలాంగూడ గ్రామంలో కుమ్ర భీంరావ్ అనే రైతు పొలంలో ఆదివారం దాడి చేసి 30 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వీటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి సాగు చేసిన, విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. పంచనామా నిర్వహించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పేర్కొ న్నారు. ఈ దాడిలో ఏఈఓ నివేదిత, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గుంజాల శివారులో పులి సంచారం



పులి పాదాల ముద్ర

భీంపూర్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజాల శివారులో పెద్దపులి సంచిరిస్తున్నదని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం గుంజల చెల్లలో సంచరిస్తున్నట్లు సమాచారం అందగానే అటవీశాఖ అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టినట్లు తెలుస్తున్నది. సీసీ కెమెరాలు అమర్చగా అందులో ఇంకా పులి జడ రికార్డు కానట్లు సమాచారం.. ఇదెలా ఉంటే ఆదివారం మధ్యాహ్నం కుమురం భీమ్‌రావు అనే రైతు తన చేనులో పనులు చేసుకుంటాఉ ఉండగా పులి అడుగులు అధికారులు ధ్రువీకరించినట్లు, స్థానిక రైతులు చెబుతున్నారు. అయితే పులి భద్రత కారణలతో అధికారులు వివరాలు వెల్లడించలేదని

వానరాల బెడదతో బెంబేలు



నర్సింహనగర్‌లోని నివాస గృహాల ప్రహారిపై వానరాలు

భైంసా,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో గత పక్షం రోజులుగా వానరాల బెడద అధికమయ్యింది. ప్రధానంగా నర్సింహానగర్, రాజీవ్‌నగర్, ఫులేనగర్, రాంనగర్,వినాయక్‌నగర్ కాలనీల పరిధిలో ప్రజలు వానరాల బెడదతో బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం వేళ నుంచి ప్రారంభమవుతున్న బెడద రాత్రి వరకు కొనసాగుతోంది. తలుపులు తెరిచి ఉన్న ఇళ్లలోకి వానరాలు చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. ఆయా నివాస గృహాల్లో చెట్లపైకి ఎక్కి కొమ్మలను, పువ్వులను తెంపివేస్తున్నాయి. ఇళ్ల ముందు అరబోసిన వివిధ ధాన్యాలు, పిండి పధార్థాలను చిందరవందర చేస్తూ తినిపారవేస్తున్నాయి. వాటిని బెదరగొట్టేందుకు యత్నిస్తున్న వారిపై ఎగబడుతున్నాయి. పలు ప్రాంతాల్లో కోతులు ద్విచక్ర వాహనదారులపై దాడికి పాల్పడుతూ బెంబేలెత్తిస్తున్నాయి. కోతుల దాడిలో గాయపడుతున్న బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కొన్ని సందర్భాల్లో ఇండ్లలో నుంచి బయటకు రావాలంటే జంకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వానరాల ఆగడాలు రోజురోజుకు పెరుగుతుండటంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు వానరాల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పెన్షనర్‌ల సమస్యల పరిష్కారానికి నేడు చలో ఆదిలాబాద్

బోథ్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పదవి విరమణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి గాను ఈ నెల 27న చలో ఆదిలాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ ప్రధాన కార్యదర్శి మురళిధర్‌లు పేర్కొన్నారు. పెన్షనర్లకు రావాల్సిన బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు పేర్కొన్నారు. అంతేకాక దీర్ఘకాలిక సమస్యల పైన కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పదవి విరమణ ఉపాధ్యాయులు హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డిలున్నారు.

కళను అభివృద్ధి చేయడమే లక్ష్యం



ఎంబ్రాయిడరీ మిషన్‌ను ప్రారంభిస్తున్న సోమ భీమ్‌రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నిర్మల్ కొయ్య బొమ్మల తయారీ కళను మరింత అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి ఆదివారం అన్నారు. కళను కాపాడుతూ మరింత మంది కళాకారులను తయారు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆదివారం కొయ్య బొమ్మల కేంద్రంలో రూ. 20 లక్షలతో ఎంబ్రాయిడరీ మిషన్‌ను హస్తకళా కార్పొరేషన్ చైర్మన్‌తో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి ప్రారంభించారు.

పేదలకు ఉచిత వైద్యం గొప్పవరం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు, వాతావరణం సంభవిస్తున్న మార్పులు అలాగే తీసుకునే ఆహారంలో కల్తీ వల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్న నేపథ్యంలో ఆదిత్య సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని పొన్నం రాహుల్ గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ 14వ వార్డులో ప్రముఖ వైద్యుడు ఎంఎస్ ఆర్థో సివిల్ సర్జన్ డాక్టర్ ప్రమోద్ చందర్ రెడ్డి, గైనకాలజిస్ట్ స్వర్ణారెడ్డి, ఎండీ డీఎం కార్డియో జగన్నాథంలైన నిష్ణాత్తులచే వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అవసరమున్న రోగులకు ఎక్స్‌రే లాంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించామన్నారు. ఇది వరకే డాక్టర్ ప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించి నిర్మల్ ప్రజల మన్ననలను పొందుతున్నారని, ఇలాంటి సేవాపరులపై ఆ భగవంతుడి కృపఉండాలన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రకృతి పరిహాసం - అన్నదాత పరితాపం

- అకాల వర్షాలతో కుదేలవుతున్న రైతన్న
- దెబ్బతింటున్న కోతదశలోని వరి పైరు
- జలమయమైన పసుపు చేలు
- ఎరుపెక్కిపోతున్న పత్తి కాయాలు



భైంసాలో దెబ్బతిన్న కోత దశలోని పైరు

భైంసా, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆశాజనకంగానున్న పంటలను చూసి కష్టనష్టాలు దూరమవుతాయనుకున్న అన్నదాత ఆశలు అడియాశలవుతున్నాయి. ప్రకృతి పరిహాసం చేస్తుండటంతో అన్నదాత పరితాపం చెందుతున్నాడు. ఏదో ఒక వైపరీత్యం అన్నదాతను నిర్వేదానికి గురిచేస్తోంది. ప్రస్తుతం ఇక్కడి ప్రాంతంలో అధిక శాతం సోయా , మొక్కజొన్న కోతలు పూర్తయ్యాయి. వరి కోతలు ప్రారంభమయ్యాయి. అయితే ఇక్కడి ప్రాంతంలో శుక్ర,శనివారాల్లో కురిసిన అకాల వర్షాలతో పంటల పైర్లు అధికంగా దెబ్బతిన్నాయి. వందలాది ఎకరాల్లో కోత దశలోనున్న వరి పైర్లు నెలమట్టమయ్యాయి. ఇక పసుపు పంటచేలు జలమయమవ్వగా పత్తి పైర్లు అధిక వర్షాలతో తెగుళ్ల బారిన పడుతున్నాయి. కాయలు ఎరుపెక్కి పోతుండటంతో దిగుబడులు తగ్గిపోయే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. కల్లాల్లోని సోయా, మొక్కజొన్న దిగుబడులు వర్షాలతో తడిసిపోతున్నాయి. అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో వ్యయ.ప్రయాసాలకు ఓనర్చి సాగు చేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో వర్షాలో జోరుగా కురుస్తుండటంతో మళ్లి కష్టనష్టాలు తప్పెటట్లుగా లేవని అన్నదాతలు కలత చెందుతున్నారు.



జలమయమైన పసుపు చేలు



ఎరుపెక్కిన పత్తి కాయలు

పేద మహిళలకు ఎమ్మెల్యే అండ



మహిళకు ఎంఎల్‌పి ద్వారా నగదు ఆర్థిక సహాయం అందించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఉట్నూర్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన పేద గిరిజన మహిళ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో కంటి చూపు కోల్పోయినందున ఆమెను నగదు ఆర్థిక సహాయం అందించడంతో పాటు కండ్లకు శస్త్ర చికిత్సలు చేయించడానికి అండగా ఉంటానని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ హామీ ఇచ్చారు. హస్నాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు పేద మహిళ రాథోడ్ వందనబాయి విపత్క పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నగదు ఆర్థిక సహాయం అందించారు. అంతేకాకుండా సోమవారం ఉదయం హైదరాబాద్ తీసుకు రావాలని అక్కడ కండ్ల ఆపరేషన్ చేయించి పేద మహిళలకు చూపు వచ్చేలా కృషి చేద్దామని ఎమ్మెల్యే మాజీ ఉప సర్పంచ్ అశోక్ తెలపడంతో హైదరాబాద్ తీసుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్నాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్షయ్, షేక్ జావేద్, విలేజ్ ప్రెసిడెంట్ షేక్ జావిద్, కైలాస్, సాదుల్లా లున్నారు.

షీలా శని దేవుడు, నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

నిర్మల్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీ గిరిక్షేత్రంలో ఉదయం 5:30 గంటలకు షీలా శని దేవుడు, నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠాపన వేద పండితులు గరుమంచి చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో వందలాది మంది భక్తులు హాజరై శని దేవుని నవగ్రహాలను దర్శించుకొని తరించారు. ఈ కార్యక్రమంలో గురుమాత రాజరాజేశ్వరి దేవి, అర్కారి రాజవ్వ, వీరనారాయణ స్వామి, చనిగారపు చిన్నయ్య, గురుస్వామి, దినేష్ స్వామి, అయిట్ల నరేష్, చింతపండు పోశెట్టి, బద్రి, శ్రీనివాస్, అదుముల్లా చక్రపాణి, హరిప్రసాద్, కుంటాల శ్రీనివాస్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు. ప్రతిష్ఠాపన అన్ని కార్యక్రమాల అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ శ్రీకాంత్ గౌడ్ రెండు రోజులు అన్నదానం నిర్వహించారు.



షీలా శని దేవుడు

యువకుడిని కాపాడిన పోలీసులను అభినందించిన ఎస్పీ



ఆత్మహత్య ప్రయత్నం చేసిన యువకుడితో లక్ష్మణచాంద పోలీసులు

లక్ష్మణచాంద, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన గొర్రె సాయి కుమార్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకుంటున్న విషయం తెలుసుకున్న లక్ష్మణచాంద పోలీసులు కాపాడిన సంఘటన ఆదివారం తెలిసింది. ఎస్సై జి. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆదివారం రోజు రాత్రి 8 గంటలకు మునిపెల్లి గ్రామానికి చెందిన గొర్రె సాయి కుమార్ అనే యువకుడు కుటుంబ కలహాల వల్ల క్షణిక ఆవేశంలో సూసైడ్ చేసుకుంటానని ఇంటి నుంచి పురుగుల మందు తీసుకొని గుర్తు తెలియని ప్రాంతానికి వెళ్లగా వెంటనే అతని బంధువులు లక్ష్మణచాంద ఎస్సై జి. శ్రీనివాస్‌కు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలకు తెలిపారు. స్పందించిన ఆమె గొర్రె సాయి కుమార్ మొబైల్ నెంబర్ లోకేషన్ తెలుసుకుని, పోలీస్ సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి అతని ఆచూకీ గురించి వెతుకగా అతనిని పట్టుకుని అతని వద్ద నుంచి పురుగుల మందు బాటిల్‌ను స్వాధీనం చేసుకొని ఆ తర్వాత గొర్రె సాయి కుమార్‌ను అతని బంధువులకు అప్పగించారు. యువకుని ప్రాణాలను కాపాడిన లక్ష్మణచాంద ఎస్సై జి. శ్రీనివాస్, బ్లూకోర్ట్ సిబ్బందిని ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

పాషాకు విశిష్ట సామాజిక సేవా రత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న షేక్ అన్సర్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా, న్యూ వెల్మల్‌కి చెందిన షేక్ అన్సర్ పాషా విశిష్ట సామాజిక సేవా రత్న పురస్కారాన్ని అందుకున్నారు. సమాజ సేవలో అంకితభావంతో పనిచేస్తూ, 'ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ' అనే సంస్థను స్థాపించి పేద విద్యార్థులకు పుస్తకాలు, అవసరమైన దుస్తులు, ఆహారం, వైద్య సహాయం అందిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సేవలను గుర్తించి 'పాటే మా ప్రాణం', లయన్స్ క్లబ్ నిర్మల్ వారియర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్మల్ న్యాయాధికారి నర్సయ్య, లేబర్ ఆఫీసర్ ముత్యం రెడ్డి, డా. కృష్ణంరాజు (కంటి వైద్యులు), నాగరాజు చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేయబడింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అన్సర్ పాషా నా సేవలను గుర్తించి ఇచ్చిన ఈ గౌరవానికి ఎంతో ఆనందంగా ఉంది. ఇది నాకు మరింత ప్రేరణనిచ్చింది. ఇకముందు కూడా సమాజ సేవలో ముందుండి మరిన్ని కార్యక్రమాలు చేపడతానన్నారు.

- భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట
- తలకిందులైన సాగు, దిగుబడి లక్ష్యం
- నేటికీ ప్రారంభం కాని కొనుగోళ్లు
- ఆందోళనలో అన్నదాతలు

జిల్లాలో సోయాబీన్ పంటను నమ్ముకొని సాగు చేసిన రైతులకు పెద్దఎత్తున కష్టాలు తప్పడం లేదు. ప్రతియేటా రైతులకు లాభాల పంట పండించే సోయాబీన్ ఈసారి మాత్రం రైతును కష్టాల కడలికి చేర్చింది. మొదట్లో సాగుచేసిన పంటలను వర్షాలు నీటిపాలు చేశాయి. వర్షాలను తట్టుకొని సాగైన పంటకు గిట్టుబాటు ధర లభించకపో వడంతోపాటు ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోళ్లను ప్రారంభించపోవడంతో చేతికి వచ్చిన పంట అంతా దళారుల పాలవుతోంది.



సోయా రైతుకు తప్పని కష్టాలు


ముథోల్‌లో తడిసిన సోయాబీన్ పంటను ఆరబెడుతున్న రైతులు


తానూర్‌లోని కర్బల గ్రామంలో వర్షాలతో దెబ్బతిన్న సోయాపంట

నిర్మల్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి, పత్తితోపాటు సమానంగా సోయాబీన్ పంటను సాగు చేస్తున్నారు. ఈసారి 1.10 లక్షల ఎకరాల్లో సోయాబీన్ పంటను రైతులు సాగు చేశారు. కాగా 66వేల మెట్రిక్ టన్నుల సోయాబీన్ దిగుబడులు రావచ్చని అధికారులు అంచనా వేశారు. అయితే మొదట్లో కురిసిన భారీ వర్షాలతో పాటు అడపాదడపా కురుస్తున్న వర్షాలతో చేతికి వచ్చిన పంట పూర్తిగా నష్టాల పాలైంది. దీంతో దిగుబడి గతానికి కన్నా గణనీయంగా తగ్గిందని రైతులు వాపోతున్నారు. అన్ని మండలాల్లోనూ ప్రస్తుతం సోయాబీన్ రైతులది దీనిస్థితి ఇలాగే ఉంది. ఇప్పటికే పలుచోట్ల రైతులు సోయాబీన్ పంట కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు సైతం చేపట్టారు. ప్రతియేటా మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా సోయాబీన్ పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నా ఈసారి మాత్రం ఇప్పటి వరకు పంటను కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ సంస్థకు బాధ్యతలు అప్పగించలేదు. దీంతో రైతులు గత్యంతరం లేకుండా ప్రేవేటు వ్యాపారులకు తక్కువ ధరలకే పంటను అమ్ముకుంటూ నష్టపోతున్నారు.

సోయాను ముంచిన భారీ వర్షాలు..

మొదట్లో భారీవర్షాలు సోయాపంటను పెద్దఎత్తున నీట ముంచాయి. ఆ నీటి నష్టాలను తట్టుకొని సాగైన సోయా పంటకు ఆశించిన మేరకు దిగుబడులు రాలేదు. తీరా చేతికి వచ్చిన సోయాబీన్ పంటను రైతులు ఆరబెడుతుండగానే అకాల వర్షాలు ఆ పంటను తడిపేశాయి. రైతులు తడిచిన సోయాబీన్ పంటకు ఆశించిన మేరకు ధర రాదని భావిస్తూ తక్కువ ధరకే వ్యాపారులకు ఆ పంటనంతా అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసిన ఉంటే రైతులకు గిట్టుబాటు ధరదక్కేది. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడం ఆలస్యమవుతుండడంతో రైతులు సాగు కోసం చేసిన అప్పులను తీర్చేందుకు తమ పంటను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోతున్నారు.

అడ్డగోలుగా దళారుల దోపిడీ

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, వర్షాలతో రైతులు ఆందోళనకు గురవుతుండడాన్ని ప్రైవేటు వ్యాపారులు ఆసరాగా చేసుకుంటున్నారు. క్వింటాకు ప్రభుత్వం రూ.5360 మద్దతు ధరగా ప్రకటించినా ప్రైవేటు వ్యాపారులు మాత్రం రైతుల అవసరాన్ని లక్ష్యంగా చేసుకొని ఒక క్వింటాకు కేవలం రూ.4వేలలోపు ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాకు సుమారు రూ.1400 నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎకరానికి కేవలం ఐదారు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని తానూర్, బాసర, కుంటాల, లోకేశ్వరం, సారంగాపూర్, నర్సాపూర్(జి) మండలాల్లో సోయాబీన్ పంటను రైతు లు ఎక్కువగా సాగు చేస్తుంటారు. అయితే ఈసారి భారీ, అకాల వర్షాలతో పంట దిగుబడులు తగ్గిపోవడం, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో పాటు కేంద్రాల ఏర్పాటుపై భరోసా కల్పించకపోవడంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి రైతులు అంతా నష్టాల పాలవుతున్నారు.

ఆందోళన బాటలో అన్నదాతలు

రైతులు గత కొద్ది రోజుల నుంచి సోయాబీన్ పంట కొనుగోళ్ల కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పంట చేతికి వచ్చి చాలా రోజులు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులకే అమ్ముకోవాల్సి వస్తుందని అంటున్నారు. ముఖ్యంగా చేతికి వచ్చిన పంటను నిల్వ చేయడం రైతులకు కత్తి మీద సాములా మారిందని అంటున్నారు. ఉదయం నుంచి ఎండ కాయడంతో రైతులంతా బహిరంగా ప్రదేశాల్లో సోయా పంటను ఆరబెడుతున్నారు. అయితే మధ్యాహ్నాని కల్లా అనూహ్యంగా అకాల వర్షం పెద్ద ఎత్తున కురియడంతో ఆరబెట్టిన పంట అంతా తడిసిముద్దవుతోందంటున్నారు. ఇలా పలుసార్లు సోయా పంట తడిసిపోవడంతో పంట నాణ్యతను కోల్పోయి మరింత తక్కువ ధరలకే అమ్ముడవుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

ఆర్థికంగా నష్టపోతున్నాం..



• కందూర్, బాబన్న, రైతు, కుభీర్

రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మేము ఆర్థికంగా చాలా నష్టపోతున్నాం. పంటను దళారులకు అమ్ముకుంటే ఇష్టం వచ్చిన రేటు అడుగుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

• ప్రవీణ్ రెడ్డి, మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి



రెండు, మూడు రోజుల్లో మార్క్‌ఫెడ్ ద్వారా సోయాబీన్ పంట కొనుగోళ్లను ప్రారంభిస్తాం. రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించొద్దు. ప్రభుత్వం క్వింటాకు రూ.5360 మద్దతు ధరను ఖరారుచేసింది. ప్రైవేటు వ్యాపారులకు పంటను అమ్ముకొని నష్టపోవద్దు. కొనుగోళ్ళ విషయంలో రైతులు ఆందోళనకు గురికావొద్దు.


స్నాన ఘట్టాల వద్ద భక్తుల రద్దీ

బాసరకు పోటెత్తిన భక్తజనం

- చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు

బాసర, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది.

అక్షర శ్రీకారాలకు శుభదినం

ఆదివారం శభప్రదమైన పంచమి తిథి కలిసారవడంతో అక్షర శ్రీకార పూజలు నిర్వహించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. తమ పిల్లలకు విద్యాభ్యాస ప్రారంభంగా భావించే ఈ శుభకార్యాన్ని జరిపించేందుకు వేలాదిమంది భక్తులు క్యూలో నిలబడి పూజలుచేయించారు. మొత్తం 903 మంది పిల్లలు పూజలు జరిపించుకున్నారు. అలాగే భక్తులు గోదావరి పుణ్యస్నానాలు ఆచరించారు.


కిక్కిరిసిన క్యూలైన్‌లు

నేడు మద్యం దుకాణాలకు లక్కీడ్రా

నిర్మల్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల దరఖాస్తు గడువు ముగిసింది. ఇక అదృష్టం ఎవరిని వరిస్తుందోనని దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ నెలకొంది. 2025-2027 మద్యం పాలసీకి సంబంధించి కొత్త షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలోని మొత్తం 47 మద్యం దుకాణాలకు ఉదయం 11గంటలకు దరఖాస్తులను లాటరీ పద్ధతిలో డ్రా ద్వారా కలెక్టర్, మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎండీ అబ్దుల్ రజాక్ ఒక ప్రకటనలో తెలిపారు.



ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

శాంతినగర్ కాలనీలో ఎన్ఎస్ఎస్ శిబిరం

నిర్మల్‌రూరల్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం శాంతినగర్ కాలనీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, మురికి కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.అర్చన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులు విజ్ఞానంతోపాటు సమాజం పట్ల బాధ్యత, సేవా గుణం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. దేశం మనకు ఏమిచ్చింది అని కాకుండా దేశానికి మనం ఏం ఇచ్చామనే దృక్పథాన్ని పిల్లలలో పెంచాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు మురహరితోపాటు కాలనీవాసులు కొండాజి రాఘవేంద్ర చారి, సంపంగి మహేష్, పసుపుల గంగాధర్, నాగరాజు, ఎత్తరి రమేష్, జొన్నల మహేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ మినీ హాల్‌లో ప్రజావాణి

నిర్మల్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ మినీ హాల్‌లో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

బిలోలిలో కందువా పండుగ

లోకేశ్వరం, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలోలిలో ఆదివారం స్నేహితులంతా కలిసి కందువా పండుగను జరుపుకున్నారు. కందువాలను ఒకరి భుజాలపై ఒకరు కప్పుకున్నారు. ఈ పండుగ స్నేహితుల మధ్యదూరం తగ్గిస్తుందని పలువురు పేర్కొన్నారు. ఇందులో శ్రీనివాస్, సదాశివరావు, ప్రవీణ్, భూమారావు, నర్సింగ్‌రావు, రాజు ఉన్నారు.

నర్సాపూర్(జి)లో కొవ్వొత్తుల ర్యాలీ

నర్సాపూర్(జి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో పోలీసులు, ప్రజలు కలిసి అమరవీరులకు నివాళులు అర్పించారు. స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట గల జాతీయ రహదారిపై నిర్వహించిన కార్యక్రమంలో పోలీసులు ప్రజలతో కలిసి కొవ్వొత్తులు వెలిగించారు. దేశ భద్రత కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుని జోహార్లు పలికారు. అమరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతీ పౌరుడి బాధ్యతని పోలీసులు పేర్కొన్నారు. ర్యాలీ పోలీస్ - ప్రజా మైత్రికి నిదర్శనంగా నిలిచింది. కార్యక్రమంలో ఏఎస్సై శంకర్, పోలీసులు మహేందర్, సంతోష్, సంజీవ్, మహిళా కానిస్టేబుళ్లు, ప్రజలు పాల్గొన్నారు.


మండల కేంద్రంలో పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ దృశ్యం

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలు

- భారీ వర్షంలోనే పథ సంచలన్
- వాడవాడలా మహిళల ఘన స్వాగతం
- హాజరైన ఎమ్మెల్యే రామారావ్ పాటిల్
- కట్టుదిట్టంగా పోలీసుల భద్రతా చర్యలు


మాట్లాడుతున్న వక్త ఎక్కా చంద్రశేఖర్


పథ సంచలన్‌లో స్వయం సేవకులు

భైంసా/భైంసారూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భైంసాలో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా మధ్యాహ్నం 3గంటలకు పట్టణ శివారులోని రాంలీలా మైదానం, కిసాన్‌గల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్ కేంద్రాల నుంచి స్వయం సేవకులు పథసంచలన్ చేపట్టారు. భారీ వర్షంలోనూ పథ సంచలన్ పట్టణ పుర వీధుల మీదుగా సాగింది. తమ ప్రాంతాలకు పథ సంచలన్ బృందాలు చేరుకోగానే ఆయా ప్రాంతాల మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. వేదికపై ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ మాట్లాడుతూ సనాతనమైన ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు అనుగుణంగా కొనసాగుతున్న హిందుత్వ జీవన విధానం విశ్వశాంతికి ఆధారమని అన్నారు. వ్యక్తి నిర్మాణం ద్వారా దేశనిర్మాణమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ కృషిచేస్తోందన్నారు. దేశ అభివృద్ధి కోసం హిందువులు పంచపరివర్తన అంశాలను పాటించాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ ఆపద కాలాల్లో ప్రాంతాలకు అతీతంగా విశిష్టసేవలను అందిస్తోందన్నారు. ఎక్కడ వైపరీత్యాలు చోటుచేసుకున్నా అక్కడ స్వయంసేవకులు త్యాగాలతో కూడిన అనిర్వచనీయమైన సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన పారిశ్రామిక వేత్త నాగ్‌నాథ్ పాటిల్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ దేశ అఖండతకు, వ్యక్తి నిర్మాణానికి, హిందుత్వ పరిరక్షణకు చేపడుతున్న సేవలు, కార్యక్రమాలు అందరూ స్వాగతించాలని కోరారు. అనంతరం సేవా భారతి డివిజన్ పరిధిలో చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ తిలకించి అభినందించారు. కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోస్లే మోహన్‌రావ్ పాటిల్, నగర్ నారాయణరెడ్డి, రవి పాండే, జిల్లా కార్యదర్శి తాడేవార్ సాయినాథ్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్, తదితరులున్నారు.

భారీ పోలీసు బందోబస్తు

ఉత్సవ వేడుకలకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో టౌన్ సీఐ గోపినాథ్ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతమైన భైంసాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తతతో వ్యవహరించింది. బందోబస్తులో నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 50 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు.


విజేతలకు బహుమతులను అందజేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

విజేతలకు బహుమతుల అందజేత

సారంగాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల జాంలో ఆదివారం ప్రీమియర్ లీగ్ విజేతలకు బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఈటోర్నమెంట్‌లో రాంసింగ్‌తండాకు చెందిన క్రీడాకారులు గెలుపొందగా మొదటి బహుమతి అందజేసి స్వర్ణ, గ్రామానికి చెందిన క్రీడాకారులకు రన్నరప్ బహుమతులను అందజేశారు. అనంతరం దుర్గాదేవి ఆలయాన్ని మహేశ్వర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలుచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రప్రకాష్‌గౌడ్, తక్కల రమణరెడ్డి, జిల్లా కరిపే విలాస్, నరేష్, రాంశంకర్‌రెడ్డి, గంగారెడ్డి, సాహెబ్‌రావు, తిరుమల చారి, చెన్న రాజేశ్వర్, రాజలింగం, లింగారెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- శ్రీ గోదాకృష్ణ ఆలయ ప్రారంభోత్సవంలో చినజీయర్ స్వామి


ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు


భక్తులతో మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

ఖానాపూర్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చిన జీయర్ స్వామి అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లోని విద్యానగర్‌లో నిర్వహించిన శ్రీ గోదాకృష్ణ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చిన జీయర్‌స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులను ఉద్దేశించి ఆయన ప్రవహనాలను బోధించారు. చిన్నజీయర్ స్వామి ఖానాపూర్ రావడంతో ఆయనను కలిసేందుకు పలువురు ప్రముఖులు క్యూ కట్టారు. స్వామివారి అనుగ్రహం పొందేందుకు ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు అయ్యేవరకు వేచి ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు పైడి పల్లి రవీందర్ రావు, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, మాజీ జడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్ర రాజం సురేష్, కొత్తపల్లి సురేష్, బీసీ రాజన్న సహా పలువురు ప్రముఖులు చిన జీయర్ స్వామిని కలిసి వారి ఆశీస్సులు పొందారు. అంతకుముందు పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో చిన జీయర్ స్వామికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి శ్రీ గోదాకృష్ణ ఆలయం వరకు ఆయనను బాజా భజంత్రీలు, మంగళవాయిద్యాలతో భక్తులు ఘన స్వాగతం పలికారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

లోకేశ్వరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలిపారు. రక్తదానం చేసేందుకు వస్తున్న రక్తదాతలకు లోకేశ్వరం మండల కేంద్రం నుంచి నిర్మల్‌కు తీసుకెళ్లేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశామని లోకేశ్వరం ఎస్సై అశోక్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

దిలావర్‌పూర్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పునర్ నిర్మించిన దేవాలయంలో శ్రీ రేణుక ఎల్లమ్మ పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞం, హోమం, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఎల్లమ్మ తల్లి పంచలోహ విగ్రహంతోపాటు శ్రీ కాల భైరవస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అంతకుముందు విగ్రహాలను గ్రామం నుంచి మహిళలు మంగళహారతులతో ముందు నడువగా ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. గ్రామ మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ, గ్రామ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

బాధితులకు ఎల్‌వోసీ చెక్కుల అందజేత

కడెం, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన చిప్పలింగవ్వ కొన్నిరోజులుగా గుండె జబ్బుతో బాధపడుతుండడంతో వైద్యం నిమిత్తం రూ.5లక్షల 40వేల ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన తాటిరమ్య కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో రూ.5లక్షల 50వేల ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మాట్లాడుతూ పేదలను అన్నిరకాలుగా ఆదుకోవడానికి ప్రజాప్రభుత్వం ఎప్పుడూ తోడుగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కొత్త మద్దిపడగ మాజీ సర్పంచ్ ఇందరూర్ నేత, కోవ ప్రవీణ్, లింగన్న, తిప్ప మల్లేష్ పాల్గొన్నారు.


బాధితులకు ఎల్‌వోసీ చెక్కులను అందజేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే